క్లుప్తంగా

ప్రతి ఒక్కరి సహకారంతో ప్లాస్టిక్ నిర్మూలన



మాట్లాడుతున్న కమిషనర్ విశ్వనాథన్

విశాఖ విద్య: పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ఏయూలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. సముద్రంలో ప్లాస్టిక్‌ను పరిమితం చేయడానికి మత్స్యకారులకు ప్రోత్సాహకాలు సహా, ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడానికి విశాఖలో తీసుకుంటున్న చర్యలను వివరించారు. పరిశుభ్రమైన, పచ్చటి భవిష్యత్తు కోసం ఐఐఎంవీ ఆధ్వర్యంలో చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఐఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్, డీన్ డాక్టర్ విజయకుమార్, రిజిస్ట్రార్ ద్వివేది పాల్గొన్నారు.

8 నుంచి ఇసుకతోట అమ్మవార్ల పండగ

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలో కొలువైన కనకమాంబ, నెల్లి పోలమాంబ, ఎర్నిమాంబ అమ్మవార్ల వార్షిక పండగ మహోత్సవం ఈ నెల 8 నుంచి 10 వరకు నిర్వహించనున్నామని శ్రీకృష్ణా ఉమా మహేశ్వర సాయిదుర్గా యాదవ సేవా సంక్షేమ సంఘం ప్రతినిధులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 8న చాటింపు, కలశ పూజ ప్రారంభం, 9న తొలేళ్ల సంబరం, అమ్మవార్లకు కుంకుమ పూజలు, లలిత సహస్ర పారాయణం జరుగుతాయని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా రాత్రికి బుర్రకథ ప్రదర్శన ఉంటుందన్నారు. 10వ తేదీ ఉదయం 4 గంటల నుంచి అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కుంకుమార్చన, సాయంత్రం 4 గంటలకు అమ్మవారి అనుపు ఉత్సవం ఘనంగా నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు చెప్పారు.

కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన

ఎంవీపీకాలనీ: ఇసుకతోట జాతీయ రహదారి దరి పెట్రోల్ బంక్‌ను ఆనుకుని ఉన్న కల్వర్టు, డ్రైనేజీ నిర్మాణానికి జీవీఎంసీ శంకుస్థాపన చేపట్టింది. జోన్–3 ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పూజలు నిర్వహించి శంకుస్థాపన చేశారు. కొంతకాలంగా శిథిలావస్థకు చేరుకున్న ఈ కల్వర్టు స్థానంలో రూ.45 లక్షలతో కొత్త నిర్మాణం చేపట్టనున్నారు. దీంతో పాటు అవసరమైన మేర డ్రైనేజీని ఆధునికీకరించనున్నారు. కార్యక్రమంలో జోన్–3 కమిషనర్ శివప్రసాద్, పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలపై సదస్సు రేపు

సీతంపేట: వికసిత్ భారత్ దిశగా విద్యార్థులకు కావాల్సిన నైపుణ్యాలు, చదువులు, డ్రగ్స్ మహమ్మారి, టెక్నాలజీ తదితర విషయాలపై ఈ నెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు అక్కయ్యపాలెం హైవే బస్టాప్ ఎదురుగా ఉన్న జీఎస్టీ కస్టమ్స్ నార్కోటిక్స్ అకాడమీ(నాసిన్)లో అవగాహన సదస్సు జరుగుతుందని బాల వికాస్ ఫౌండేషన్ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ ఐఆర్ఎస్ అధికారి, నాసిన్ డైరెక్టర్ ఈదర రవికిరణ్ ముఖ్య వక్తగా ప్రసంగిస్తారని చెప్పారు. పాఠశాల, కళాశాలల విద్యార్థులు పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రహదారి మధ్యలో గుంత



వీఎంఆర్‌డీఏ పార్క్‌కు వెళ్లే రోడ్డులో ప్రమాదకరంగా గొయ్యి

ఏయూక్యాంపస్: వాల్తేరు డిపో కూడలి నుంచి వీఎంఆర్‌డీఏ పార్క్‌కు వెళ్లే మార్గంలోని రోడ్డు మధ్యలో గుంత ఏర్పడింది. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహన చోదకులకు ఇది ఇబ్బందికరంగా మారింది. ప్రయాణికులు ఆచితూచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాళ్లు, పిక్క రోడ్డుపైకి వస్తున్నాయి. దీంతో ద్విచక్ర వాహనాలు జారిపోవడం, ప్రయాణికులకు గాయాలు కావడం జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతను పూడ్చాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

నత్తనడకన..

- ఎంవీపీ ఏబీసీ పార్క్ అభివృద్ధి పనుల్లో తీవ్ర జాప్యం
- కాంట్రాక్టర్ తీరుపై స్థానికుల విమర్శలు
- పట్టించుకోని జోన్–3 అధికారులు



ఆరంభంలోనే నిలిచిన వాకింగ్ ట్రాక్ పనులు



ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని ఏబీసీ పార్క్ ప్రాంగణం

ఎంవీపీకాలనీ: ఎంవీపీ సెక్టార్–6లోని ఏబీసీ పార్క్ ఆధునికీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దశాబ్దాలుగా ఈ పార్క్ అభివృద్ధికి నోచుకోలేదు. దీనిలో ఆహ్లాదం కరువవడంతోపాటు కనీస సౌకర్యాలు కూడా లేవు. దీంతో ఈ పార్క్‌ను ఆధునికీకరించి సౌకర్యాలు కల్పించాలనే స్థానికుల డిమాండ్ మేరకు జీవీఎంసీ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. రూ.40 లక్షలతో ఏబీసీ పార్క్ ఆధునికీకరణకు గత నెలలో శంకుస్థాపన చేసింది. ఈ పనులను గణేష్ ఎంటర్‌ప్రైజెస్‌కు అప్పగించగా.. ఆ సంస్థ పనుల నిర్వహణలో తీవ్ర జాప్యం చేస్తోంది. మే తొలి వారంలోనే ప్రారంభమైన ఈ పనులు మధ్యలో నిలిచిపోవడమే ఇందుకు నిదర్శనం.

మధ్యలోనే నిలిపివేత

ప్రస్తుతం పార్క్ చుట్టూ ట్రాక్ నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్ట్ సంస్థ మధ్యలోనే వాటిని ఆపేసింది. వాకింగ్ ట్రాక్‌తో సహా ఇప్పటి వరకు పనులు ముందుకు సాగలేదు. నెల రోజుల కిందట పనులు ప్రారంభమైనప్పటికీ.. వారం రోజుల్లోనే అవి నిలిచిపోయినా జీవీఎంసీ జోన్–3 ఇంజినీరింగ్ విభాగం అధికారులెవరూ పట్టించుకోక పోవడంపై స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు పర్యవేక్షించి పార్కు ఆధునికీకరణ పనులు వేగంగా జరిగేలా చూడాలని ఎంవీపీ సెక్టార్–6 వాసులు కోరుతున్నారు.

రూ.40 లక్షలు.. చేపట్టాల్సిన పనులు

ఏబీసీ పార్క్ ఆధునికీకరణ పనులకు జీవీఎంసీ రూ.40 లక్షలు మంజూరు చేసింది. పార్క్ చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణం, దానికి ఇరువైపులా బ్రిక్ వాల్స్, పార్క్‌లో వివిధ ఫంక్షన్ల కోసం నిర్మించిన ప్రధాన వేదిక ఎక్స్‌టెన్షన్, ఇతర ఆధునికీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. స్థానిక చిన్నారుల కోసం చిల్డ్రన్ ప్లే ఏరియా, వాకర్స్, వృద్ధులు, మహిళల కోసం ఓపెన్ జిమ్ సముదాయాన్ని పార్క్‌లో కొత్తగా ఏర్పాటు చేయనున్నారు.



ఆధునికీకరించాల్సిన పార్క్‌లోని ప్రధాన వేదిక

చిన్నపాటి వర్షానికే జలమయం



హనుమంతవాక కూడలిలో నిలిచిన వర్షపు నీరు



మద్దిలపాలెం కూడలిలో జోరువాన

ఆరిలోవ: స్థానిక బీఆర్‌టీఎస్ రహదారిలో పలుచోట్ల వర్షం నీరు నిల్వ ఉండిపోతోంది. చిన్నపాటి వర్షం కురిసినా.. కూడళ్లు జలమయమవుతున్నాయి. రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపమో ఏమో గాని వర్షా కాలం వస్తే కూడళ్లు నీటితో నిండిపోయి వాహన చోదకులకు ఇబ్బందిగా మారుతున్నాయి. గురువారం సాయంత్రం కురిసిన చిన్నపాటి వర్షానికే హనుమంతవాక, పెదగదిలి కూడళ్ల వద్ద బీఆర్‌టీఎస్ రోడ్డులో నీరు నిల్వ ఉండిపోయింది. హనుమంతవాక వద్ద ట్రాఫిక్ పోలీసులు పట్టుకుని నిలిపిన వాహనాల చుట్టూ వాన నీరు చేరిపోయింది. దీంతో అటుగా వెళ్లే వాహన చోదకులు నీటిలో ఇబ్బంది పడ్డారు. వర్షా కాలం నేపథ్యంలో తరచూ ఆయా కూడళ్ల వద్ద ఇదే సమస్య ఎదుర్కోక తప్పదని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఊరటనిచ్చిన వాన

మద్దిలపాలెం: మండే ఎండలతో ఉక్కిరిబిక్కిరవుతున్న నగరవాసులకు గురువారం సాయంత్రం కురిసిన వర్షం ఊరటనిచ్చింది. సుమారు 45 నిమిషాల పాటు భారీగా కురిసిన వానతో కాలనీలు, రహదారులు తడిసిముద్దయ్యాయి. వర్షం తీవ్రతకు రోడ్లు కనిపించకపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఎండతో ఉక్కిరిబిక్కిరైన జనం ఒక్కసారిగా కురిసిన వర్షానికి ఉపశమనం పొందారు. మద్దిలపాలెం, కేఆర్ఎం కాలనీ, శివాజీపాలెం, పిఠాపురం కాలనీ సర్వీస్ రోడ్లు వర్షపు నీటితో నిండిపోయాయి.

మొక్కల పంపిణీ

మద్దిలపాలెం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం కేఆర్ఎం కాలని పార్కులో గార్డెనర్స్ సొసైటీ ఆఫ్ వైజాగ్, సి.టి.జి, వనమాలి గ్రూప్ సభ్యుల ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథి 16వ వార్డు కార్పొరేటర్ మొల్లి లక్ష్మి చేతుల మీదుగా సుమారు 100 మొక్కలకు పైగా బాటసారులకు అందించారు. కార్యక్రమంలో సొసైటీ ఇన్‌చార్జిలు కల్పన, శ్రీసుధ, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



మొక్కలు అందిస్తున్న కార్పొరేటర్ మొల్లి లక్ష్మి

కాలుష్య నియంత్రణకు మొక్కలు నాటుదాం

మద్దిలపాలెం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచే బాధ్యత తీసుకోవాలని ఏపీఎస్‌ఆర్టీసీ విశాఖ జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి బి.అప్పలనాయుడు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన అధ్వర్యంలో జిల్లాలోని అన్ని డిపోల్లో అధికారులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించారు. మద్దిలపాలెం డిపో ఆవరణలో ముఖ్య అతిథిగా ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ విశాఖను కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కనీసం ఒక్క మొక్కయినా నాటాలన్నారు. బస్సుల కండిషన్‌ను మెరుగుపరచాలని, బస్సుల ఇంజెక్టర్స్, టిన్స్ మొదలగు సామగ్రిని ఎప్పటికప్పుడు మార్చాలని సిబ్బందికి సూచించారు. బ్రేకులు, టైర్లను ఎప్పటికప్పుడు బాగుచేయాలని, తద్వారా కాలుష్యాన్ని కొంతమేరైనా తగ్గించవచ్చన్నారు. అనంతరం మద్దిలపాలెం డిపో సిబ్బందికి పనిముట్లు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ కె.రాజశేఖర్, డిపో మేనేజర్ కె.గంగాధర్, అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్లు రామకృష్ణ, నాయుడు, అసిస్టెంట్ మేనేజర్ అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.



మద్దిలపాలెం డిపో సిబ్బందికి పనిముట్లు అందిస్తున్న ఆర్టీసీ అధికారి అప్పలనాయుడు

పర్యావరణాన్ని కాపాడుదాం



తోటగరువు వెటర్నరీ ఆస్పత్రి ఆవరణలో మొక్క నాటుతున్న జేడీ కరుణాకరరావు



జోడుగుళ్లపాలెం పార్కులో మొక్కలు నాటుతున్న జోన్–2 కమిషనర్ కనకమహాలక్ష్మి



కృష్ణా కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

ఆరిలోవ: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గురువారం జీవీఎంసీ అధికారులు పలు వార్డుల్లో నిర్వహించారు. 9వ వార్డులో జోన్–2 కమిషనర్ కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో మొక్కలు నాటించారు. జోడుగుళ్లపాలెంలో ఇటీవల నిర్మించిన పార్కులో పలు రకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, ప్లాస్టిక్ నిషేధానికి కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

◆ 13వ వార్డులో జీవీఎంసీ శానిటరీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ నిషేధానికి అందరూ సహకరించాలని నినాదాలు చేశారు. వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను విడనాడాలి

పర్యావరణాన్ని కాపాడేందుకు ప్లాస్టిక్‌ను నిషేధించాల్సిన అవసరముందని జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.కరుణాకరరావు అన్నారు. చినగదిలి మండలంలోని పశువుల ఆస్పత్రుల్లో మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించారు. తోటగరువు పశు వెటర్నరీ ఆస్పత్రి ఆవరణలో ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. ప్రకృతిని కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా మెలగాలన్నారు. ఇందులో భాగంగా పర్యావరణాన్ని నాశనం చేస్తున్న ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు. కార్యక్రమంలో ఉప సంచాలకుడు డాక్టర్ చంద్రశేఖరరావు, సహాయ సంచాలకులు డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, వెటర్నరీ వైద్యులు పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో పర్యావరణ దినోత్సవం

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్ష శాస్త్ర విభాగం, హరిత కృష్ణ ఎకో క్లబ్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ సంయుక్తంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించాయి. ఈ సందర్భంగా ప్లాస్టిక్ నిర్వహణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ బీట్ ద ప్లాస్టిక్ పొల్యూషన్‌లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ మాట్లాడుతూ తీర ప్రాంత కాలుష్యం గురించి ప్రస్తావిస్తూ సముద్ర జీవులకు ప్లాస్టిక్ వల్ల కలిగే హానిని తెలియజేశారు. వృక్ష శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పద్మావతి, హరిత కృష్ణ ఎకో క్లబ్ కన్వీనర్ పద్మజ, అధ్యాపకులు పుష్పలత, స్వామి నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విభాగాధికారులు

ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఏయూ ఆవరణలో ఐదేళ్ల వయసు గల రావి, వేప మొక్కలను విభాగ అధికారులు నాటారు. చీఫ్ ఇంజినీర్ తిరుపతిరావు, వీరాస్వామి, ప్రభాకర్, రాజశేఖర్, రమణ పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం.. ఆదర్శంగా నిలుద్దాం

బీచ్‌రోడ్డు: ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి భావితరాల కోసం పర్యావరణాన్ని కాపాడుతూ ఆదర్శంగా నిలుద్దామని 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి సురేష్ పిలుపునిచ్చారు. 20వ వార్డులో స్వచ్ఛ హరితాంధ్ర కోసం మొక్కలు నాటుదాం – పర్యావరణాన్ని కాపాడుదాం కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. వార్డులోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల సురేష్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్, జీవీఎంసీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, ఆర్పీలు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

◆ పెదవాల్తేరులోని ప్రభుత్వ చెస్ట్ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ కృషి చేయాలని, అధిక సంఖ్యలో మొక్కలు నాటాలని యువతకు పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టి, విశాఖను కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దాలన్నారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



20వ వార్డులో మొక్క నాటి నీరు పోస్తున్న కార్పొరేటర్ మువ్వల లక్ష్మి



మొక్కలు నాటుతున్న ఏయూ ఇంజినీరింగ్ విభాగం అధికారులు

ప్లాస్టిక్ రహితంగా కైలాసగిరి

ఆరిలోవ: పర్యాటక ప్రాంతం కైలాసగిరిని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన అధికారులతో కలిసి కైలాసగిరిని సందర్శించారు. అక్కడ అధికారులు, సిబ్బందితో కలిసి ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త సేకరించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మానవ జీవన విధానం పర్యావరణ హితంగా ఉండాలన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల భావితరాలకు ముప్పు వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే విధంగా ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా గుడ్డ, నార సంచులు వాడాలని ప్రజలకు ఆయన సూచించారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ కార్యదర్శి మురళీకృష్ణ, పర్యవేక్షక ఇంజినీర్ భవానీశంకర్, కార్యనిర్వాహక ఇంజినీర్లు రామరాజు, దుర్గాప్రసాద్, రాంబాబు, డీఎఫ్‌వో సుజాత శివాని తదితరులు పాల్గొన్నారు.



కైలాసగిరిపై చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

శిథిలమవుతున్న సర్వీస్ రోడ్డు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పెదగదిలిలో సర్వీస్ రోడ్డు శిథిలమవుతోంది. పెదగదిలి కూడలి నుంచి శివాలయం మీదుగా చినగదిలి కూడలి వరకు సర్వీస్ రోడ్డు పలు చోట్ల దెబ్బతింది. ఇక్కడ కొండవాలు ప్రాంతానికి చెందిన కాలనీల కోసం ఈ రోడ్డులో గతంలో యూజీడీ పనులు జరిగాయి. ఇందులో భాగంగా జీవీఎంసీ యూజీడీ విభాగం అధికారులు రోడ్డు మధ్యలో తవ్విన గోతులను మట్టితో పూడ్చి దానిపై సీసీ వేశారు. కొన్నిచోట్ల అప్పట్లో గోతులు సరిగా పూడ్చకుండా పైన సీసీ రోడ్డు వేయడంతో ఇప్పుడు శిథిలావస్థకు చేరుతోంది. సీసీ భాగంలో ప్రస్తుతం రోడ్డు పగిలిపోయి ముక్కలుగా విరుగుతోంది. మరి కొన్నిచోట్ల లోపల మట్టి కిందకు కుంగిపోవడంతో రోడ్డు గోతులుగా మారుతోంది. ఈ రోడ్డులో దెబ్బతిన్న చోట మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



దెబ్బతిన్న పెదగదిలి సర్వీస్ రోడ్డు

డ్రైనేజీ నిర్మాణంలో నాణ్యత లోపం



లాసన్స్ బే కాలనీలో ఎగుడు దిగుడుగా నిర్మించిన డ్రైనేజీ గోడలు



నాణ్యత లోపంతో వైర్ల వద్ద వదిలేసిన గోతులు

ఎంవీపీకాలనీ: లాసన్స్ బే కాలనీ బీచ్ రోడ్డును ఆనుకొని ఉన్న డ్రైనేజీని జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఆధునికీకరిస్తోంది. దశాబ్దాలుగా మూతపడి ఉన్న ఈ కాలువ వ్యవహారం ఇటీవల ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. దీంతో డ్రైనేజీపై నిర్మించిన షాపులను ఇటీవల అధికారులు తొలగించి దీని ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. కొన్ని రోజులుగా ఈ పనులు జరుగుతుండగా.. కాంట్రాక్ట్ సంస్థ కనీస నాణ్యత లేకుండా పనులు నిర్వహిస్తోంది. డ్రైనేజీకి ఇరువైపులా గోడల నిర్మాణంలో నాణ్యత లోపించి పలు చోట్ల ఇసుక తేలిపోయింది. దీంతో పాటు గోడలను క్రమపద్ధతిలో కాకుండా చాలా చోట్ల ఎగుడు దిగుడుగా నిర్మించడం విమర్శలకు తావిస్తోంది. దీంతో కాంట్రాక్ట్ సంస్థ ఇష్టారాజ్యంగా పనులు నిర్వహిస్తున్నా.. జీవీఎంసీ జోన్–3 ఇంజినీరింగ్ విభాగం అధికారులు కనీసం పర్యవేక్షించకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు దృష్టి సారించి డ్రైనేజీ ఆధునికీకరణ పనులు నాణ్యంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

అప్పన్నకు నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై ఉత్సవమూర్తులను వేంజేపచేసి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు.

ఐఐఏఎంలో ఎన్ఈపీపై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న అతిథులు, అధ్యాపకులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీలోని ఇంటిగ్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్(ఐఐఏఎం) బీ స్కూల్‌లో గురువారం నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ(ఎన్ఈపీ–2020)పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఉన్నత విద్యా సంస్థలకు బోధనా పద్ధతులు అనే అంశంపై కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ఈపీ–2020 పాలసీని అర్థం చేసుకోవడం, కేంద్రీకృత బోధనా విధానాలు, విద్యార్థుల్లో సృజనాత్మక పెంపొందించడం, అంతర్జాతీయ అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల సన్నద్ధత, బోధనా ప్రమాణాల మెరుగుకు వక్తలు సభ్యులకు వివరించారు. ఈ పాలసీ ద్వారా నూతన ఆధునిక పద్ధతులు అందిపుచ్చుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ విధానంలో అధ్యాపకులకు ఎదురయ్యే సవాళ్లు, పరిష్కార మార్గాలపై చర్చించారు. కార్యక్రమంలో ఐఐఏఎం బీ స్కూల్ డీన్ డాక్టర్ ఎస్.పి.రవీంద్ర, ఏయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్, ఏఎస్‌యూ మాజీ వీసీ ఆచార్య బాలమోహన్ దాస్ తదితరులు పాల్గొన్నారు. వివిధ జిల్లాల నుంచి విద్యా సంస్థల అధ్యాపకులు హాజరయ్యారు.

తప్పిపోయిన వ్యక్తి కుటుంబం చెంతకు..



కుటుంబ సభ్యులకు దేవేంద్రను అప్పగిస్తున్న మమత

విశాఖ విద్య: మానసిక స్థితి సరిగ్గా లేక, ఇంటి నుంచి తప్పిపోయి వచ్చిన వ్యక్తిని ఎట్టకేలకు వారి కుటుంబం చెంతకు చేర్చారు. వివరాలివి.. కొన్ని రోజుల కిందట కంచరపాలెం ఫుట్‌పాత్ మీద దుస్తులు లేకుండా, మానసిక పరిస్థితి బాగాలేక తిరుగుతున్న వ్యక్తిని స్థానికుల సమాచారంతో 90వ వార్డులోని జీవీఎంసీ షెల్టర్‌కు తరలించారు. అతడి ఆరోగ్య పరిస్థితి సరిగా లేనందున, కంచరపాలెం పోలీసుల సమక్షంలో స్థానిక మెంటల్ కేర్ హాస్పిటల్‌లో చికిత్స చేయించారు. తన పేరు దేవేంద్ర అని, తనది తెలంగాణలోని వేములవాడ గ్రామమని చెప్పడంతో.. షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత వేములవాడలో తనకు తెలిసిన వారికి దేవేంద్ర విషయం తెలియజేశారు. దేవేంద్ర ఫొటోను వాట్సాప్ ద్వారా పంపించడంతో వారి కుటుంబ సభ్యులు గుర్తించి.. విశాఖపట్నం వచ్చారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ సహాయంతో దేవేంద్రను గురువారం మెంటల్ కేర్ హాస్పిటల్ నుంచి డిశ్చార్జి చేయించి, అతడి తల్లికి అప్పగించడంలో షెల్టర్ మేనేజర్ మమత ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. వారు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.